
సైనికుల కవాతు


గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్


జాతీయ పతాకానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ వందనం

సామాజిక, ఆర్థిక ప్రగతిలో...

ఐదు గ్యారెంటీలతోనూ పురోగతి

కర్ణాటక పరుగులు..!

- మౌలిక సదుపాయాల కల్పనలో ముందంజ
- బెంగళూరు అభివృద్ధికి ప్రాధాన్యం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక రంగాల ప్రగతిలో కర్ణాటక పరుగులు తీస్తోందని, దేశంలో అత్యుత్తమంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అన్నారు. నగరంలోని మాణెక్ షా పరేడ్‌మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు గవర్నర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ బృందాలకు అభివాదం చేస్తూ గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరేడ్ మైదానం నుంచి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి 'ఎల్లరిగు నమస్కార' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. కర్ణాటక రాజ్యాంగంలోని మహత్తర ఆశయమైన సామాజిక, ఆర్థిక న్యాయాన్ని శక్తికి మించి పాటిస్తోందన్నారు. ఐదు గ్యారెంటీలు అమలు చేస్తూనే ఆర్థిక ప్రగతికి అడుగులు వేస్తోందన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతతో సామాజిక న్యాయానికి జరుగుతున్న వెనుకబాటుకు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా ఐదు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేసి దేశం దృష్టిని పొందిందన్నారు. గ్యారెంటీలతో ఆర్థిక సమస్య ఏర్పడనుందని, అభివృద్ధి కుంటుపడుతుందనే విమర్శలకు చెక్ పెట్టేలా రాణించారన్నారు. రాజ్యాంగ ఆశయంలోని సమాఖ్య ధర్మాన్ని పాటిస్తోందన్నారు. దేశ, రాష్ట్రాల మధ్య సంబంధాలు మెరుగు కావాలని కర్ణాటక భావిస్తోందన్నారు. ఐదు గ్యారెంటీలలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కారణమైందని గవర్నర్ కొనియాడారు. గృహలక్ష్మి ద్వారా ప్రతి ఇంటి యజమానిరాలికి నెలవారీ రూ.2వేలు చొప్పున ఇప్పటివరకు రూ.35,180 కోట్లు ప్రోత్సాహకం ఇచ్చారన్నారు. గృహజ్యోతితో 1.62 కోట్ల మందికి రూ.13,409 కోట్లు విద్యుత్ కంపెనీలకు అందించారన్నారు. శక్తి గ్యారెంటీ ద్వారా ఉచిత బస్సు ప్రయాణానికి ఇదివరకు 9051కోట్లు ఖర్చు చేశారన్నారు. యువనిధి పథకం ద్వారా 1,24,176మందికి నగదు బదిలీ జరిగిందని, యువనిధి ప్లస్ ద్వారా 12వేలమందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు సాధ్యమయ్యాయన్నారు. అన్నభాగ్య ద్వారా 4.48 కోట్లమందికి రూ.9,775.51 కోట్లు నగదుబదిలీ చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 13శాతం ప్రగతి సాధించిందన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 25 మొరార్జీదేశాయ్ పాఠశాలలను ఇటీవలే ప్రారంభించారన్నారు. 50 మౌలానా ఆజాద్ పాఠశాలలను ప్రారంభించారని, సొంతభవనాలు ఉన్న పాఠశాలలకు పీయూ కళాశాలలుగా పదోన్నతి కల్పించారన్నారు. 2491 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 3103 కిలోమీటర్ల జిల్లా రోడ్లు, 190 బ్రిడ్జిల నిర్మాణం చేశారన్నారు. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు దాకా 88,853 మిలియన్ యూఎస్ డాలర్ల మేర ఎగుమతులతో దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటికి ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రాంతీయ అసమానతలు తొలగించేలా కల్యాణ కర్ణాటక అభివృద్ధికి రూ.5వేల కోట్లు గ్రాంటు కేటాయించడంతోపాటు ఇటీవల కలబురగిలో కేబినెట్ భేటీ జరిపి 11వేల కోట్లు విలువైన పనులకు ఆమోదం తెలిపారన్నారు.

బెంగళూరుకు ప్రాధాన్యం

బెంగళూరు నగరానికి ప్రాధాన్యం కల్పించేలా మెట్రో రైల్ రెండో విడతలో సిల్క్‌బోర్డు నుంచి కేఆర్‌పురం దాకా 19.75 కిలోమీటర్లు, 2బి స్టేజ్‌లో కేఆర్ పురం నుంచి ఎయిర్‌పోర్ట్ దాకా 38.44 కిలోమీటర్ల మేర నిర్మాణాలకు రూ.14,788 కోట్లు ఖర్చుకు ఆమోదం తెలిపారన్నారు. బెంగళూరు అభివృద్ధి ప్రాధికార నగర వ్యాప్తంగా 34 ప్రాంతాలలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లను నిర్మించదలిచిందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనసాగు, పట్టు పరిశ్రమకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇన్‌క్యుబేషన్ సెంటర్ల ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఆన్‌డ్యూటీ, ఆఫ్ డ్యూటీలో ప్రమాదవశాత్తు మృతి చెందితే కోటి రూపాయల బీమా వర్తింపచేస్తున్నారన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేలా ఏఐ ఆధారిత పర్యవేక్షణ అమలులోకి తెచ్చారన్నారు. రాష్ట్రం అన్ని విభాగాల ద్వారా అన్నివర్గాలకు సముచిత సామాజిక న్యాయం కల్పిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేసేలా రాష్ట్రంతోపాటు సమృద్ధ కర్ణాటక ద్వారా శక్తివంతమైన భారత్ నిర్మాణానికి అందరూ కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాగా గవర్నర్ పరేడ్‌మైదానంలోకి రాగానే భారతీయ రక్షణా విభాగం సీనియర్ అధికారులు పరిచయం చేసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్‌కు రాష్ట్ర పోలీసులతోపాటు వైమానిక, మిలిటరీ, కేరళ పోలీసులతోపాటు కేఎస్‌ఆర్‌పీ, బెంగళూరు నగర, ట్రాఫిక్ విభాగం, ఎన్‌సీసీ సమర్థనం ట్రస్టు మహిళా పోలీసులు, మహిళా కేఎస్‌ఆర్‌పీ బలగాలతోపాటు బ్యాండ్‌మేళాబృందాలు గౌరవవందనం సమర్పించాయి.


వేడుకల్లో గవర్నర్‌తో సీఎం తదితరులు

వేడుకల్లో ముఖ్యమంత్రి

మాణెక్ షా పరేడ్ మైదానంలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్నారు. జాతీయపతాకావిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్‌తో కలసి వీక్షించారు.


విద్యకు ప్రాధాన్యం.. ప్లకార్డుల ప్రదర్శన


ప్రతిభ కనబరచిన మిలిటరీ బృందానికి ట్రోఫీ అందజేస్తున్న గవర్నర్


కేరళ పోలీసుల కవాతు


సమర్థనం అంధ విద్యార్థుల కవాతు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మాణెక్ షా పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర వేడుకల్లో వేలాదిమంది విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మనమంతా ఒక్కటే భారతీయులం పేరిట అగరలోని కర్ణాటక పబ్లిక్ స్కూల్‌కు చెందిన 800మంది విద్యార్థులు నృత్యం చేశారు. అనంతరం గూర్ఖా రైఫిల్స్ కుర్కీ డ్యాన్స్ చేశారు. 13మంది పంజాబీ సైనికులు భాంగ్రా పంజాబీ జానపద నృత్యం చేశారు. అరివే అంబేడ్కర్ పేరిట హారోహళ్ళి బీబీఎంపీ పీయూ కళాశాలకు చెందిన 650 మంది విద్యార్థులు నృత్యం చేశారు. అనంతరం టెంట్ పెగ్గింగ్ పేరిట గుర్రపుస్వారీ, విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 13మంది పంజాబీ సైనికులు గట్కా టీమ్ పేరిట కత్తుల విన్యాసం ఆకర్షణీయంగా నిలిచింది.

బస్సు హైజాక్ మాక్ డ్రిల్

బస్సును ఉగ్రవాదులు హైజాక్ చేస్తే ఏ విధంగా సైనికులు అటాక్ చేసి రక్షించాలి అనే విధంగా నిర్వహించిన ప్రదర్శనలు హైలెట్‌గా నిలిచాయి. బస్సును ఇద్దరు ఉగ్రవాదులు హైజాక్ చేయగా రక్షణ బలగాలు అటాక్ చేసి బస్సులోకి ప్రవేశించి ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతోపాటు ప్రయాణీకులందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చే రూపకం ప్రత్యేకం అనిపించింది. రక్షకదళానికి శ్వానదళ సహకారం కూడా ఆకర్షణీయం అనిపించింది. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్, బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


అశ్వదళం విన్యాసం


దేశ భక్తి ఉట్టిపడేలా..


మహనీయులను స్మరిస్తూ..


హైజాకర్ల నుంచి బస్సు ప్రయాణికులను కాపాడే ప్రదర్శన


ఎగసిపడే పారుషాగ్ని..

ఐదేళ్లూ సిద్దరామయ్య సీఎంగా ఉండాలి

- బసవరాజరాయరెడ్డి



బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిద్దరామయ్య ఐదేళ్ల గడువుదాకా ముఖ్యమంత్రిగా కొనసాగాలని సీనియర్ ఎమ్మెల్యే, సీఎం ప్రత్యేక ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి అన్నారు. కొప్పళలో ఆదివారం సాహిత్యభవనంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఐదేళ్లు సిద్దరామయ్య సీఎంగా ఉండాలనేవారి జాబితాలో నేను మొదటివాడినన్నారు. ఉత్తమ పాలన, మంచి పనులతోపాటు పేదలకు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చే పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ఇదే సందర్భంలోనే మంత్రి జమీర్ అహ్మద్‌ను ఉద్దేశించి అతడు నాకంటే 13ఏళ్లు చిన్నవాడైనా మంచి హృదయం కల్గినవారని కొనియాడారు. ఇటీవల నాయకత్వ మార్పు అంశంపై కొనసాగుతున్న చర్చలకు అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగంగా మాట్లాడరాదంటూ హెచ్చరించింది. ఇలా నాలుగైదురోజులుగా అందరూ మౌనంగా ఉన్నారు. అయితే బసవరాజరాయరెడ్డి మరోసారి ప్రస్తావన తీసుకురావడం గమనార్హం.

బెంగళూరుకు శివరాజ్ కుమార్

- ఘన స్వాగతం పలికిన అభిమానులు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ సంబంధిత సమస్యతో అమెరికాలో చికిత్సలు పొంది సంపూర్ణ ఆరోగ్యంతో ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ బెంగళూరుకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు నటుడు శ్రీనగర్ కిట్టి స్వాగతించారు. పెద్ద ఎత్తున అభిమానులు విమానాశ్రయానికి చేరుకున్నా, గణతంత్ర దినోత్సవం వేళ ప్రత్యేక బందోబస్తు కారణంగా వెనక్కి పంపారు. యలహంక సమీపంలోని టోల్ వద్ద శివరాజ్‌కుమార్‌ను అభిమానులు సాదరంగా స్వాగతించారు. 500 కేజీల గజమాలలతో స్వాగతం పలికారు. భారీగా కటౌట్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. నాగవారలోని శివరాజ్‌కుమార్ ఇంటిదాకా అభిమానుల ర్యాలీ సాగింది.

కిడ్నాప్ కథ సుఖాంతం

- 12 గంటలలోపే ఛేదించిన పోలీసులు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఎస్పీ శోభారాణి
- ఎస్పీని ప్రశంసించిన సీఎం, డిప్యూటీ సీఎం


ఎస్పీ శోభారాణి

బళ్లారి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. జిల్లా ఎస్పీ శోభారాణి ప్రత్యేక నిఘా ఉంచి నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నగరమంతా జల్లెడ పట్టారు. దీంతో కిడ్నాపర్లు చేసేది లేక డాక్టర్‌ను వదిలేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చిన్నపిల్లల వైద్యులుగా డాక్టర్ సునీల్‌కుమార్ శెట్టి విధులు నిర్వహిస్తున్నారు. ఈయన బళ్లారి నడిబొడ్డున్న ఉన్న ఎస్ఎన్ పేటీలో నివాసముంటున్నారు. శనివారం తెల్లవారుజామున వాకింగ్ వెళ్లే సమయంలో కిడ్నాపర్లు కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. రూ.6 కోట్లు ఇస్తేనే డాక్టర్‌ను విడిచిపెడతామని డాక్టర్ సోదరుడు వేణుగోపాల్‌శెట్టికి కిడ్నాపర్లు ఫోన్‌లో బెదిరించారు. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ స్పందించి నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ముందుగా నగరం నుంచి కిడ్నాపర్లు బయటకు వెళ్లకుండా అన్ని చెక్‌పోస్టులను అలర్ట్ చేశారు. నగర నలుదిక్కులా ఉన్న గ్రామాల ప్రజలను, పోలీసు ఇన్‌ఫార్మర్లకు సెల్‌ఫోన్లలో అలర్ట్ చేశారు. ఉదయం నుంచి ఒక పక్క పోలీసులకు సూచనలు, సలహాలు ఇస్తూనే మరో పక్క వారి కుటుంబీకులకు మనోధైర్యం నింపారు. ట్రావెలర్స్ యజమానులతో మాట్లాడి కిడ్నాపర్లు వాడిన కారు ఎక్కడిది అని వెంటనే తెలుసుకున్నారు. తాము నగరం నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదని గుర్తించిన కిడ్నాపర్లు శనివారం రాత్రి 9 గంటలకు డాక్టర్‌ను వదిలేశారు. ఆయనను గుర్తించిన పోలీసులు వెంటనే ఇంటికి తీసుకువచ్చారు. డాక్టర్ సునీల్ కుమార్ సోదరుడు మద్యం షాపులు నిర్వహిస్తున్నాడు. వందల కోట్లకు పడగలెత్తిన వీరికి ప్రత్యేకంగా శత్రువులు లేరని వారి కుటుంబీకుల ద్వారా తెలిసింది. అయితే సునీల్ కుమార్ సోదరుడు వేణుగోపాల్‌ను నాలుగేళ్ల క్రితం ఎవరో చంపడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీన్ని కూడా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి పోలీసులు అత్యంత కీలక సమాచారం రాబట్టినట్లు తెలిసింది. ఒక ప్రముఖ వ్యాపారి డాక్టర్‌ను అపహరించేందుకు ఇతరులకు ఒప్పందం ఇచ్చారని పోలీసులు కూపీ లాగారు. కిడ్నాప్ చేసిన వ్యక్తుల్లో ఒకరిని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోనే ఒక గోదాములో డాక్టర్‌ను ఉంచి, రాత్రి 9 గంటలకు రూ.300 ఇచ్చి డాక్టర్‌ను పంపినట్లు తెలిసింది. కిడ్నాపర్ల యాస, భాష ఆధారంగా ఆరా తీస్తున్నారు. పోలీసుల వద్ద సెల్‌ఫోన్ కాల్స్, టవర్ లొకేషన్, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక పరంగా ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. కిడ్నాపర్లను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. కిడ్నాప్ కేసును 12 గంటల్లోనే ఛేదించడంపై సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ ఎస్పీని ఫోన్‌లో ప్రశంసించారు. ఎట్టకేలకు డాక్టర్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది.


కిడ్నాపర్ల చెర నుంచి బయట పడిన డాక్టర్ సునీల్ కుమార్

ప్రయాణం.. భారం..!

అనుకూల సమయంలో ఉన్న రైళ్ల రద్దు

ప్రయాణికులకు పెరిగిన చార్జీల ఖర్చు.. ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు



అనంతపురానికి కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్‌లో దివ్యాంగుల బోగీలోకి ఎక్కుతున్న అన్‌రిజర్వుడు జనరల్ టిక్కెట్టు ప్రయాణికులు



గుంతకల్లు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా ప్రయాణించే రైళ్లు ఆగిపోవడం వేలాదిమందికి కష్టాలు తెచ్చిపెట్టింది. గుంతకల్లు నుంచి అనంతపురం, ధర్మవరం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, దినవారీ పనికి వెళ్లే కూలీల పరిస్థితి రైలు రద్దు కావడంతో తల్లకిందులైంది. ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ఇక్కడ తిరిగే తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి (నం.57405/06) ప్యాసింజరును, తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/03), తిరుపతి-హుబ్లీ-తిరుపతి (నం. 57401/02) ప్యాసింజరు రైళ్లను రద్దు చేశారు. గత నెల ఆఖరు నుంచి మార్చి 1వ తేదీ వరకూ ఈ ప్యాసింజరు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో అనంతపురం, తిరుపతికి వెళ్లి వచ్చేవారి సమస్య తీవ్రమైంది. తిరుపతి ప్యాసింజరుకు ప్రత్యామ్నాయంగా మరో రైలు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రం అయ్యాయి. తక్కువ డబ్బుతో ప్రయాణాలు చేసేవారికి నాలుగింతల చార్జీల భారం పడింది. రైలులో రూ. 40లు ఖర్చు అవుతుండగా బస్సుకు రూ. 300లు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు, ఉద్యోగులు, బడుగుజీవులు వాపోతున్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లే రైలు అందుబాటులో లేకుండాపోవడం ఇబ్బందికరంగా మారిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమస్య ఇలా.. ప్రతిరోజూ అనంతపురం, ధర్మవరం వెళ్లడానికి అనుకూలమైన సమయంలో ఉదయం 6-40 గంటలకు కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు గుంతకల్లుకు వచ్చేది. ఈ రైలు ఉదయం ఎనిమిదిన్నరకు అనంతపురం, 9-15 గంటలకు ధర్మవరం చేరేది. అలాగే తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు ఉదయం 6 గంటలకు ధర్మవరంలో, ఉదయం 7 గంటలకు అనంతపురం వచ్చి గుంతకల్లుకు 9 గంటలకల్లా వచ్చేది. తిరిగి వెళ్లడానికి తిరుపతి-గుంతకల్లు రైలు ఉపయోగపడేది. ఈ రైళ్లకు ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు అనంతపురం, ధర్మవరం వెళ్లి తక్కువ చార్జీతో తిరిగి వచ్చేవారు. కానీ కుంభమేళా కారణంగా ఈ రైళ్లు రద్దుకావడంతో వారందరికీ సంకట పరిస్థితి ఏర్పడింది. ఈ రైళ్లే కాదు తిరుపతికి వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-తిరుపతి, గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు రైళ్లను కూడా రద్దు చేయడంతో పుణ్యక్షేత్రమైన తిరుమలకు వెళ్లడానికి తగిన రైళ్లులేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముంబై-చెన్నై వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల్లో ప్రయాణించడానికి స్థలం లేక తిరుపతి ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ రైలే లేదు

ఉదయం గుంతకల్లు నుంచి అనంతపురం వెళ్లే తిరుపతి ప్యాసింజరు రైలు రద్దు కావడంతో వేరే ఎక్స్‌ప్రెస్ రైలుకు వెళ్లే అవకాశాలు కూడా లేకుండాపోయాయి. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 9 గంటలదాకా మరో రైలు అందుబాటులో లేదు. గతంలో కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు 7 గంటలకు గుంతకల్లుకు చేరుకుని ఐదు నిమిషాలలో బయలుదేరి వెళ్లేది. కానీ రైళ్ల వేగాలు పెరిగిన తర్వాత ఈ రైలు ఉదయం 6 గంటలకు గుంతకల్లుకు చేరేలా సమయాన్ని సవరించారు. ఈ రైలుకు వెళ్లాలంటే అధికధరను చెల్లించడంతోపాటు కూర్చోవడానికి కూడా స్థలం దొరకని రద్దీ ఉంటుంది. పైగా ఉదయం 5 గంటలకు లేస్తే తప్ప ఈ రైలును అందుకోలేరు. ఈ రైలు కాక సోమవారం రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్, బుధ, శుక్రవారాలలో జైపూర్ ఎక్స్‌ప్రెస్, శనివారం ఓకా ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. జనరల్ కంపార్టుమెంట్లు అడుగు పెట్టడానికి కూడా స్థలం లేనంత రద్దీ ఉంటుండటంతో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్థానికుల ప్రయాణాలకు ఏమాత్రం అనువుగా ఉండవు.



తిరుపతి ప్యాసింజర్

ఈ రైలు అవసరమా?

అత్యంత ఆవశ్యకమైన గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరును రద్దుచేసిన డివిజనల్ అధికారులు పెద్దగా ప్రాధాన్యం లేని చిగ్జాజుర్-గుంతకల్లు-చిగ్జాజుర్ (నం. 57451/52) ప్యాసింజరు రైలును మాత్రం నడుపుతున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన ఈ రైలును ప్రాధాన్యం లేని బళ్లారి-చిగ్జాజుర్ మార్గంలో వేరే జోన్ పరిధిలోకి నడపాల్సిన అవసరం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రైలును కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య తాత్కాలికంగా నడిపినా డివిజన్ కేంద్రంలో, జిల్లా ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి ఈ రైలును జిల్లాలో నడపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

కుంభమేళాకు రైళ్ల మళ్లింపు విషయం ఉన్నతాధికారుల పరిధిలోనిది. వారు ఇచ్చిన ఆదేశాలను మాత్రమే మేము అమలు చేస్తున్నాం. రైళ్ల రద్దుతో స్థానిక ప్రయాణికులకు మాత్రం కొంత ఇబ్బందికరంగానే ఉంది. అయిన కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇక్కడి రైళ్లను అక్కడికి మళ్లించారు. మార్చి 1 నుంచి పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు.

- అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్, అనంతపురం

అనంతపురం వెళ్లాలంటే సమస్యగా ఉంది



జిల్లా కేంద్రానికి వెళ్లేవారికి తిరుపతి ప్యాసింజరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆ రైలు మూడు నెలలపాటు రద్దుచేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు వెయ్యి మంది ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. గుంతకల్లు-కల్లూరు మధ్యలో ఉన్న చిన్న స్టేషన్ల నుంచి కూడా ఎందరో ఎక్కి పనులకు అనంతపురం, ధర్మవరం వెళ్లేవారు. ఈ రైలును నిలిపివేయడం అందరికీ సమస్యగా మారింది.

-క్రిష్ణయ్య, గుంతకల్లు

అనంతపురం ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నారు



గుంతకల్లు, సమీప ప్రాంతాలకు చెందిన పేదలు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తిరుపతి ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. ఈ రైలు బందయ్యాక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు తక్కువ చార్జీతో జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం లేకుండాపోయింది. పేద ప్రజల సౌకర్యార్థం వెంటనే తిరుపతి ప్యాసింజరును పునరుద్ధరించాలి.

-మహమ్మద్ గౌస్, సీపీఐ నాయకుడు, గుంతకల్లు

తిరుపతికి వెళ్లడం కష్టంగా మారింది



ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తిరుపతికి వెళ్లే రైళ్లన్నింటినీ రద్దుచేశారు. ఎక్కడో జరుగుతున్న కుంభమేళా కోసం ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెట్టడం దారుణం. తిరుపతికి వెళ్లడానికి బస్సులు కూడా తగినన్ని లేవు. కనుక ఎంతో సమస్యగా మారింది. ప్యాసింజరును రద్దు చేయడం విద్యార్థులు, ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లేవారికి ఎంతో ఇబ్బందికరంగా మారింది. గతంలో నడిపిన గుంతకల్లు-ధర్మవరం ఫాస్ట్ ప్యాసింజరు రైలును పునరుద్ధరిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

-కే వెంకటేశ్వర్లు, అనంతపురం

చిగ్జాజుర్ ప్యాసింజరును ధర్మవరానికి నడపాలి



పెద్దగా ఉపయోగపడని గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరును మార్చి వరకూ కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య నడిపితే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చిగ్జాజుర్ ఈశాన్య రైల్వేలో ఉంది. మన జోన్‌కు, డివిజన్‌కు ఎటువంటి సంబంధంలేని చోటికి రైలును నడిపేబదులు జిల్లాలో నడిపితే మేలు.

- ఎం వెంకటేశులు, కాంట్రాక్టు లెక్చరర్, గుంతకల్లు

అయ్యో.. రైతన్న

విద్యుదాఘాతంతో మృతి

కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



గంగాధర్ (ఫైల్)

ధర్మవరంరూరల్, జనవరి26(ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించుకునే ప్రయత్నంలో రైతు మరణించాడు. పొలం చుట్టూ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో షాక్‌తో మరణించాడు. మండలంలోని మల్లాకాల్వ గ్రామానికి చెందిన రైతు సాకే గంగాధర్ (38) విద్యుదాఘాతంతో ఆదివారం మరణించాడు. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైతు తనకున్న మూడెకరాల పొలంలో బోరుబావి కింద వేరుశనగ సాగుచేశాడు. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని, పంట పెట్టాడు. ప్రస్తుతం పంట కాపు వచ్చింది. పొలం సమీపంలోని కొండగుట్టల నుంచి రాత్రివేళల్లో అడవి పందులు పంటపై దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఆ రైతు కుటుంబం రోజూ టపాకులు పేల్చుతుండేది. అయినా పంటపై పందులు దాడి చేస్తుండేవి. దీంతో రైతు గంగాధర్ పొలం చుట్టూ విద్యుత్ వైరు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి పొలానికెళ్లాడు. విద్యుత్ స్తంభంసమీపాన జీ వైర్‌తో పొలం చుట్టూ ఉన్న తంతికి కనెక్షన్ ఇచ్చాడు. జీ వైర్‌ను ప్రధానలైన్‌కు తగిలించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, అక్కడే కుప్పకూలాడు. ఒళ్లంతా కాలిపోయి మరణించాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గంగాధర్ పొలంలో కిందపడి ఉన్న బ్యాటరీ లైటు వెలగడం చూసి దగ్గరకు వెళ్లి చూశారు. గ్రామస్థులు, కుటుంబీకులకు తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. రైతుకు భార్య ప్రభావతి, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు భార్య ప్రభావతి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. రోజూ పొలం వద్దకు తనను తీసుకెళ్లేవాడనీ, శనివారమే వద్దని చెప్పి వెళ్లాడంటూ రోదించింది.



పొలంలో మృతదేహం

ఖాద్రీశుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

కదిరి లీగల్/గాండ్లపెంట/నంబులపూలకుంట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆదివారం కదిరిలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జిల్లా పోర్టు పోలియో జడ్జి కూడా అయిన జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డికి ఆలయ తూర్పు రాజగోపురం వద్ద సహాయ కమిషనర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని న్యాయమూర్తి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. అనంతరం కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయించాలని న్యాయవాదులు.. న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు. న్యాయమూర్తి వెంట స్థానిక న్యాయాధికారి జయలక్ష్మి, డీఎల్ఎస్ఏ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలో వెలసిన యోగివేమన ఆలయాన్ని హైకోర్టు జడ్జి సందర్శించారు. నంబులపూలకుంట మండలంలోని గూటిబైలు గ్రామ సమీపంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును న్యాయమూర్తి సందర్శించారు. ఆలయంలో తిమ్మమాంబ, బాలవీరయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.



జస్టిస్ శ్రీనివాస్ రెడ్డికి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

దాడుల కలకలం

ధర్మవరంలో రెచ్చిపోయిన జమీర్ వర్గం

టీడీపీ వర్గీయుల వాహనాలపై రాళ్లు

కిందకు దిగిన వారిపై కర్రలతో దాడి

ఆరుగురికి గాయాలు



ధ్వంసమైన టీడీపీ నాయకుల వాహనాలు

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ నాయకులపై దాడి ఆదివారం కలకలం రేపింది. వైసీపీ నుంచి బీజేపీలోకి చేరనున్న జమీర్ అహమ్మద్‌తోపాటు ఆయన వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఆరుగురికి గాయాలు కాగా.. రెండు వాహనాలు, మరో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. పట్టణంలోని పదో వార్డులో పల్లవి థియేటర్ సమీపాన అటుగా వెళ్తున్న టీడీపీ నాయకుల వాహనాలపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. వాహనాలు దిగిన వారిపై కర్రలతో దాడులకు తెగబడ్డారు. దీంతో టీడీపీకి చెందిన షాహీర్, జావీద్, భానుప్రకాశ్, 12 ఏళ్ల చిన్నారి ఉబేష్, చిన్నారు లోకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మాన్ స్వల్పంగా గాయపడ్డాడు. దాడులతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

వాహనాలపై రాళ్లు

ధర్మవరంలోని పదో వార్డుకు చెందిన క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్ వైసీపీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. అదే వార్డుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు వాహనాల్లో ఆదివారం మధ్యాహ్నం అటు వైపుగా వెళ్తున్నారు. వాటిపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ నాయకులు వాహనాలు దిగి, ఎందుకు రాళ్లు వేస్తున్నారని ప్రశ్నించారు. వారు మరింత రెచ్చిపోయారు. ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో వాహనాలను ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. తమను చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారన్నారు. ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డామని వారు తెలిపారు. అక్కడి నుంచి పోలీసుల సాయంతో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే టీడీపీ శ్రేణులు భారీగా చేరుకుని, అండగా నిలిచారు. అనంతరం గాయపడిన వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించి, బందోబస్తు మధ్య చికిత్సలు నిర్వహించారు.

వైసీపీ హయాంలోనూ..

గత వైసీపీ హయాంలోనూ జమీర్ వైసీపీలోకి చేరి తమపై దాడి చేసినట్లు టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. జమీర్ వర్గీయులు సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాది ముందే టీడీపీని వీడి, ఆ పార్టీలో చేరారు. వైసీపీలోకి చేరిన నెల వ్యవధిలోనే టీడీపీకి చెందిన ముగ్గురు ముస్లింలపై విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పట్లో కేసు కూడా నమోదు చేయలేదని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేసిన క్రిష్ణాపురం జమీర్ బీజేపీలో చేరేందుకు సిద్ధమవడాన్ని టీడీపీ వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేయడమేకాకుండా భౌతిక దాడులకు పాల్పడిన జమీర్, ఆయన కుటుంబసభ్యులను కూటమిలోని బీజేపీలోకి ఎలా చేర్చుకుంటారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ వినతిని ఖాతరు చేయటంటూ టీడీపీ వర్గీయులు రగలిపోతున్నారు.



టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్న వైసీపీ వర్గీయులు

భారీ బందోబస్తు

టీడీపీ వర్గీయులపై దాడులు పట్టణంలో కలకలం రేపాయి. టీడీపీ వర్గీయులు వేలాది మందిగా తిరుగుబాటుకు రంగం సిద్ధం చేశారు. పరిస్థితిని పసిగట్టిన డీఎస్పీ హేమంత్‌కుమార్ ప్రత్యేక బలగాలను మోహరించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చిస్తూ పరిస్థితిని గాడిన పెట్టడంలో సఫలీకృతులయ్యారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్, ఆస్పత్రి వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడి విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఎల్ నరేంద్రచౌదరి, పరిశే సుధాకర్, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవ రెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకున్నారు.



దాడిలో గాయపడిన లోకేశ్, షామీర్, జావీద్, భానుప్రకాశ్

శోభాయమానంగా శాంతి సద్భావన యాత్ర

అనంతపురం కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ 286వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి చేపట్టిన శాంతి సద్భావనయాత్ర శోభాయమానంగా సాగింది. అంతకుముందు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజినాయక్ మాట్లాడారు. గిరిజనులకేకాక అన్ని సామాజిక వర్గాలవారికి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం శాంతి సద్భావన యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర పురవీధులగుండా సాగింది. బంజారాల సంప్రదాయం ఉట్టిపడేలా వేషధారణలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శేఖర్ బాబు, ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ నాయక్, చక్రే నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న భక్తులు.. రథంలో ప్రత్యేక అలంకరణలో సంత్ సేవాలాల్ మహరాజ్

హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు

గణతంత్ర దినోత్సవాన పస్తులు

సీకే పల్లి బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్




బీసీ హాస్టల్లో మధ్యాహ్న భోజనం అందక ఆకలితో ఉన్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీకే పల్లి బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్న భోజనం అందలేదు. మోడల్ స్కూల్, ఉన్నతపాఠశాలకు చెందిన 3 నుంచి పదో తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. గణతంత్ర వేడుకలకు ఉదయం వెళ్లి.. మధ్యాహ్నం 12 గంటలకు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ వంటగదికి తాళం వేసి ఉండటంతో చాలా సేపు వేచి చూశారు. డబ్బులున్న కొందరు హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. మరికొందరు పార్శిల్ తెచ్చుకుని తిన్నారు. డబ్బులు లేనివారు ఆకలితో అలమటించారు. వార్డెన్ నారాయణ స్వామి నింపాదిగా సాయంత్రం 4 గంటలకు హాస్టల్‌కు వచ్చారు. తమకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బడిలో పెట్టలేదా అని ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దారు సురేశ్ కుమార్ హాస్టల్‌కు వెళ్లి విచారించారు. వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ వ్యవహారశైలి బాగా లేదని, మద్యం తాగి వస్తుంటారని స్థానికులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వార్డెన్ మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తోందని అన్నారు. దీంతో విషయాన్ని ఆర్డీఓ కలెక్టర్ టీఎస్ చేతన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వార్డెన్ నారాయణస్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి తెలిపారు.

మంత్రి సవిత ఆగ్రహం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నుంచి కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదని అన్నారు. వార్డెన్‌పై చర్యలకు ఆదేశించారు. విచారించి, నివేదిక ఇవ్వాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ధర్మవరం ఆర్డీఓ మహేశ్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మోజార్ట్ (జయంతి)

మోజార్ట్ 1756 జనవరి 27న హోలీ రోమన్ సామ్రాజ్యంలోని సాల్జ్‌బర్గ్‌లో జన్మించారు. పాశ్చాత్య సంప్రదాయ సంగీతంలో పేరొందారు. కీ బోర్డు, వయోలిన్‌పై ప్రతిభ చాటారు. ఐదేళ్ల వయసునుంచే సంగీతం స్వరపరచడం, రాజ కుటుంబీకుల ముందు ప్రదర్శనలు చేశారు. 17ఏళ్లకు సాల్జ్‌బర్గ్ కోర్టులో సంగీతకారుడయ్యారు. వియన్నాలో స్థిరపడ్డా కీర్తి దక్కిందికానీ ఆర్థికంగా నిలదొక్కుకోలేదు. చివరి సంవత్సరాలలో సింఫనీ, కానెసెర్టో, ఒపెరాలు స్వరపరిచాడు. 600కుపైగా సంగీత కళా ఖండాలను స్వరపరిచారు. 35ఏళ్లకే 1791 డిసెంబరు 5న కన్నుమూశారు.

డాక్టర్ పోతుకూచి సాంబశివరావు (జయంతి)

'కళా ప్రపూర్ణ' డాక్టర్ పోతుకూచి సాంబశివరావు 1928 జనవరి 27న తూర్పు గోదావరి జిల్లా ఆలమూరులో జన్మించారు. వృత్తి రీత్యా న్యాయవాది అయినా సాహిత్యంపై మక్కువతో పేరొందారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో కవి, రచయిత, నరేటర్, వ్యాసరచయిత, ఎడిటర్‌గా రాణించారు. కథా రచయితగా సుమారు 350 కథలు రాశారు. ఆంధ్రజ్యోతి సహా పలు పత్రికలలో ప్రచురితమయ్యాయి. 1950 తొలి నవల 'ఉదయ కిరణాలు'తో గుర్తింపు పొందారు. నవ్య సాహితి సమితిని స్థాపించి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించారు. భారత్ భాషా భూషణ్, సరస్వతీ సమ్మాన్ తదితర పురస్కారాలు పొందారు. 2017 ఆగస్టు 6న కన్నుమూశారు.

ఇంగ్‌వర్ కాంప్రాడ్ (వర్ధంతి)

అంతర్జాతీయంగా పేరొందిన ఐకియా సంస్థ సంస్థాపకుడు ఫియోడర్ ఇంగ్‌వర్ కాంప్రాడ్ 1926 మార్చి 30న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన వ్యాపార దిగ్గజం. ఫర్నీచర్ రంగంలో విప్లవాత్మక మార్పులు సాధించారు. తన జీవితంలోని ఒడిదుడుకులు, విజయాలతో కూడిన 'ఏ ట్రీట్‌మెంట్ ఆఫ్ ఏ ఫర్నీచర్ డీలర్' పుస్తకాన్ని రచించారు. 91వ యేట 2018 జనవరి 27న కన్నుమూశారు.

నిఖిల్ బెనర్జీ (వర్ధంతి)

'పద్మభూషణ్' గ్రహీత పండిట్ నిఖిల్ రంజన్ బెనర్జీ 1931 అక్టోబరు 14న కోల్కత్తాలో జన్మించారు. మైహర్ ఘరానా శైలిలో క్లాజికల్ సితార్ వాదకులుగా పేరొందారు. 20వ శతాబ్ధంలో పేరొందిన రవిశంకర్, విలయత్ ఖాన్‌ల తర్వాత ఆ స్థాయిలో పేరొందారు. సితార్‌లో బాబా అల్లావుద్దీన్ ఖాన్ వద్ద శిక్షణ పొంది 9వ యేటకే ఆలిండియా రేడియోలో సితార్ కళాకారుడిగా చేరారు. సంగీత నాటక అకాడమీ తదితర అవార్డులు పొందారు. 1986 జనవరి 27న కన్నుమూశారు.


మంజుళా పరమేశ్ బృందం నృత్య ప్రదర్శన


మల్లేశ్వరంలో జాతీయపతాకం ఆవిష్కరణలో బ్యాంకు అధికారులు


పతాకావిష్కరణలో ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు తదితరులు

రాష్ట్రవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు

» అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా అధికారులు పతాకావిష్కరణ చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు ప్రత్యేక ఆహ్వానితులుగా భాగస్వామ్యులయ్యారు. జిల్లాస్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. బెంగళూరులో కేపీసీసీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు జరిపారు. పార్టీ అధ్యక్షులు విజయేంద్ర శివమొగ్గలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఇక జేడీఎస్, ఆప్ కార్యాలయాలలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలు జరిపారు.

హైకోర్టు ప్రాంగణంలో...

హైకోర్టు ప్రాంగణంలో ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ అంజారియా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులకు సత్వరన్యాయం దిశగా న్యాయస్థానాలు పని చేస్తున్నాయన్నారు. పలువురు హైకోర్టు న్యాయ మూర్తులు, ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రవీంద్ర కళాక్షేత్రలో...

నగరంలోని రవీంద్ర కళాక్షేత్రలో కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికు లను అలరించాయి. మంజుళా పరమేశ్ బృందం ప్రదర్శిం చిన నృత్య కార్యక్రమం హైలెట్‌గా నిలిచింది.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో..

కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంలో 76వ రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ, సీఈఓ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సొంతంగా రాజ్యాంగం ఏర్పాటు చేసుకుని పాలన ప్రారంభించిన సుదినమని కొనియాడారు. పతాకాన్ని ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపించారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో..

రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని యూనియన్‌బ్యాంకు జోనల్ కార్యాలయం మల్లేశ్వరంలో పతాకావిష్కరణ జరిపారు. జోనల్ హెడ్ నవనీత్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రిపబ్లిక్‌డే ప్రాధాన్యతను, బ్యాంకుల జాతీయీకరణపై ఆయన ప్రసంగించారు. రీజనల్ హెడ్ రాజేంద్రకుమార్‌తోపాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యపట్ల నిర్లక్ష్యం వద్దు : ఎంపీ డాక్టర్ మంజునాథ్

నగరంలోని ఎన్‌ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో బసనగుడి నేషనల్ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. బెంగళూరు గ్రామీణ జిల్లా ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్‌షీట్ అనేది కేవలం సర్టిఫికెట్ మాత్రమే కాదని మన బతుకుకు రక్షా కవచమన్నారు. విద్యను నిర్లక్ష్యం చేయకుండా చక్కగా చదివి ఉన్నత హోదాలలో రాణించాలని విద్యార్థులకు హితవు పలికారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌ఈఎస్ సంస్థ జాయింట్ కార్యదర్శి ఇస్తూరి సుధాకర్, సంస్థ అధ్యక్షులు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య తదితరులు పాల్గొన్నారు.


బంగారపేటలో వివిధ రంగాల సాధకులకు సత్కారం

తగ్గుతున్న అసమానతలు : ఎమ్మెల్యే

బంగారపేట: రాజ్యాంగం ద్వారా పేద, దళిత, మైనారిటీవర్గాల వారు సైతం సమాజంలో ఉన్నత హోదాలు అందుకోవడానికి వీలైందని క్రమేపీ అసమానతలు తగ్గుతున్నాయని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పీయూ కళాశాల ఆవరణలో జాతీయపండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన 76వ గణతంత్ర వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రజలందరికీ హక్కులు సాధ్యమవుతున్నాయన్నారు. దేశ ప్రగతికి కాంగ్రెస్ ప్రభుత్వాల సేవలు అనన్యమన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అమలు చేసిన గరీబీ హఠావో, 20 అంశాల కార్యక్రమం పేదలు, దళితుల అభ్యున్నతికి దోహదపడ్డాయన్నారు. ప్రస్తుతం దేశం ఐటీ రంగం అభివృద్ధి చెందేందుకు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దూరదృష్టితో వేసిన బాటలే కారణమన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చొరవతోనే ఆర్టీఈ విధానంతో ఎంతోమందికి విద్య చేరువ అవుతోందన్నారు. ప్రస్తుతం సీఎం సిద్దరామయ్య ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తూ అన్నివర్గాలకు అండగా ఉన్నారన్నారు. కాగా నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో నాలుగుసార్లు పురసభ సభ్యుడిగా, అధ్యక్షుడిగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. త్వరలోనే బీఈఓ, పట్టు, వ్యవసాయ శాఖలకు నూతన భవన నిర్మాణపనులు చేపడతామన్నారు. కామసముద్ర, తొప్పనహళ్ళి గ్రామంలో హాస్టల్, పట్టణంలో బస్టాండ్, ఇండోర్ స్టేడియంలను ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 20 కోట్ల రూపాయలతో యరగోళ్ డ్యాం ద్వారా 24గంటలు నీరు అందించే పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధకులను ఎస్సై సుని ల్, హెడ్‌కానిస్టేబుల్ సీతా రామ సింగ్, ఉద్యానవనాల శాఖ డైరెక్టర్ శివారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ బాను, సమాజ సేవకుడు బాబు, రఫీక్ తదితరులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశప్ప, గ్రేడ్ 2 తహసీల్దారు గాయత్రి, పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, ఈఓ రవికుమార్, వ్యవసాయ శాఖ ప్రతిభా, ఉద్యానవనాలశాఖ అధికారి శివారెడ్డి, సీడీపీఓ మునిరాజు, బీఈఓ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌పురలో...

మహదేవపుర: 76వ గణతంత్ర వేడుకలు కేఆర్‌పురలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఆవిష్కరించారు. పోలీసు, సేవాదళ్, తాలూకా స్కౌట్స్ అండ్ గైడ్స్, పాఠశాల విద్యార్థులచే గౌరవవందనం స్వీకరించారు. జాతీయ పండుగల ఆచరణ సమితి అధ్యక్షుడు


కేఆర్‌పురలో ఎమ్మెల్యే గౌరవవందనం

బీఎస్ రాజీవ్, బీఈఓ సీఎన్ గోవిందప్ప, కేఆర్‌పుర సీఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నో భాషలు, పలు మతాలు, కులాల వారు భిన్నత్వంలో ఏకత్వంలా కొనసాగేందుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే సాధ్యమైందని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నేటి విద్యార్థులు, యువతకు స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన ఎందరో త్యాగాలు, వారి దేశభక్తిని తెలియచేసేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సందర్భంగా పంచాంగం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తద్వారా మన సంస్కృతి సంప్రదాయాలను తెలిపే ఎన్నో పండుగలు వీటిలో ఉన్నాయన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. పతాకావిష్కరణ అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.

సర్జాపురలో..

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపురలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానంలో సర్జాపుర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మమతా రమేశ్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ అధ్యక్షుడు ఎస్ఎం శ్రీనివాస్, మాజీ ఉపాధ్యక్షుడు ఏ సతీశ్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో...

ముళబాగిలు: స్వాతంత్ర్య వేడుకలో ఘనంగా నిర్వహిస్తున్నా నేటికీ అక్కడక్కడా అస్పృశ్యత కొనసాగుతుండడం విచారకరమని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ విచారం వ్యక్తం చేశారు. పట్టణంలోని నేతాజి క్రీడా మైదానంలో తాలూకా పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటైన గణతంత్ర వేడుకలకు అధ్యక్షత వహించి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగ ఆశయాలు అందరికీ అందాలన్నారు. తహసీల్దారు వి గీతా, న్యాయవాది శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఇదే సందర్భంగా వివిధరంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


చింతామణిలో సాధకులకు సన్మానం


విజయనగర్ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణప్ప తదితరులు


విజయపురలో భరతమాత ఊరేగింపు


గణతంత్ర వేడుకల్లో ఎంపీ డాక్టర్ మంజునాథ్ తదితరులు


ముళబాగిలులో వివిధరంగాల సాధకులకు సన్మానం


శిడ్లఘట్టలో క్యాలెండర్ ఆవిష్కరణ

బంగ్లా అక్రమ వలసదారులను తిప్పి పంపుతాం: మాజీ మంత్రి

మహదేవపుర, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన వారిని తిప్పిపంపే బాధ్యత మనందరిదని మాజీ మంత్రి అరవిందలింబావళి పేర్కొన్నారు. కాటంనల్లూరు మంజునాథస్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటైన భారతమాత పూజ, మహదేవపుర ఉత్సవాన్ని ఎమ్మెల్యే మంజుళా లింబావళి అధ్యక్షతన ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మాజీ కల్నల్ తివారి, కల్నల్ గోపినాథ్ ఆర్‌పిసింగ్, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ ఎట్టిపరిస్థితుల్లోనూ బంగ్లాదేశీయులకు పని కల్పించరాదన్నారు. వివిధ పాఠశాల, కళాబృందాల భరతనాట్యం, సంగీతం, జానపద నృత్యం, డొళ్ళు కుణిత, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇదే సందర్భంగా క్రీడ, సంగీతం, విద్య, సమాజసేవ తదితర రంగాల ప్రముఖులను సత్కరించారు. బెంగళూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సప్తగిరిగౌడ, నియోజకవర్గ అధ్యక్షుడు హండి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, నటరాజ్, జిల్లా ప్రతినిధి నాగరాజ్, లోకేశ్, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.


మహదేవపుర ఉత్సవ్‌లో మాజీ మంత్రి లింబావళి

మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ డిశ్చార్జ్

» మరికొన్ని రోజులు ఇంట్లో విశ్రాంతి

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కారు ప్రమాదంలో గాయపడి బెళగావి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. 13రోజులపాటు చికిత్సలు పొందిన ఆమె కోలుకోవడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఆదివారం ఉదయం ఆమె ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు, అభిమానులు సాదరంగా స్వాగతించారు. ఈనెల 14న తెల్లవారుజామున మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కారు కిత్తూరు తాలూకా అంబడిగట్టి వద్ద చెట్టును ఢీ కొనడంతో ఆమె గాయపడ్డారు. డిశ్చార్జ్ వేళ మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం నుంచి బతకడమే నాకు పునర్జన్మ లభించిందన్నారు. రాజకీయ జీవనంలో పోరాటం చేసిన నాకు ఇలా జరగాల్సి ఉండేది కాదన్నారు. ఆసుపత్రిలో పరామర్శించిన సీఎం, డీసీఎంలతోపాటు సహచర మంత్రులు, స్వామిజీలు, అభిమానులు అందరికీ ధన్యవాదాలన్నారు. మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారని అందుకు అనుగుణంగా ఇంట్లోనే గడుపుతానన్నారు.

తెలుగు పాఠశాలలో జెండా రెపరెపలు


వివేక్‌నగర్ పాఠశాలలో...

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సేవాభారత్ ట్రస్టు ఆధ్వర్యంలోని వివేక్‌నగర్‌లోని తెలుగు ఉన్నత పాఠశాలలో రిపబ్లిక్ వేడుకలు సాగాయి. తెలుగు, కన్నడ, తమిళ పాఠశాలల ప్రాంగణంలో ట్రస్టు కన్వీనర్ రంగస్వామి నాయుడు జాతీయజెండా ఆవిష్కరించారు. హెడ్మాస్టర్ తిప్పేస్వామి, ఉపాధ్యాయుడు భువనానందల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. విద్యార్థుల ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రంగస్వామి నాయుడు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగంద్వారా దేశంలోని పౌరులందరికీ సమానహక్కులు సాధ్యమయ్యాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు క్రాంతివీర సంగొళ్ళిరాయణ్ణ జయంతి కావడం మరో అరుదైన విషయమని కొనియాడారు.


సోమసుందరపాళ్య ప్రభుత్వ పాఠశాలలో..


సర్జాపురలో గణతంత్ర వేడుకలు

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమసుందరపాళ్య ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చిన్మయ విద్యాసంస్థ చైర్మన్ కే వాసుదేవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని గురించి వివరించారు. అలాగే దేశభక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. విద్యతోనే ప్రగతి సాధ్యమన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత హోదాలలో రాణించి పేరొందాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

సాయిరాం గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు, వార్షికోత్సవం జరిగాయి. సమాజసేవ చేసిన డాక్టర్ అంజనప్పను ఆత్మీయంగా సత్కరించారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకుడు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యం, యోగా తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

హొంగసంద్రలో...

హొంగసంద్రలోని ఆదర్శ లే అవుట్‌లో గణతంత్ర వేడుకలను అర్థవంతంగా ఆచరించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ భారతి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పౌరకార్మికులు, రిటైర్డు ఉద్యోగులను ఆత్మీయంగా సత్కరించారు. మంజునాథ్, యోగానన్, ప్రకాశ్‌రెడ్డి, ఫ్రాన్సిస్ కులకర్ణి, ప్రకాశ్, నాయక్, విఠల్ సంగాతి, కేఈబీ వెంకటేశ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల వార్షికోత్సవంలో ప్రముఖులు


హొంగసంద్ర ఆదర్శ లే అవుట్‌లో..

నేడు రాజ్‌భవన్ సందర్శనకు ఉచిత ప్రవేశం


బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని రాజ్‌భవన్ సందర్శనకు ఉచిత ప్రవేశం కల్పించారు. సోమవారం సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు రాజ్‌భవన్‌ను ఎవరైనా సందర్శించవచ్చునని రాజ్‌భవన్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్ ప్రకటించారు. రాజ్‌భవన్‌కు వచ్చేవారికి కెమెరాలు, సంచులతోపాటు ఎటువంటి ప్లాస్టిక్, ఆహార పదార్థాలు, లగేజ్‌బ్యాగ్‌లు నిషేధమన్నారు. రాజ్‌భవన్‌ను సందర్శించాలని భావించే ప్రజలకు ఇదో మహత్తరమైన అవకాశం.

ఓడిపోయామని నిర్లక్ష్యం సరికాదు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయామని నిర్లక్ష్యం చేయడం సరికాదని, పార్టీ, ప్రభుత్వంలో మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో బెంగళూరు గ్రామీణ నుంచి ఓటమి చెందిన మాజీ ఎంపీ డీకే సురేశ్ నేతృత్వంలో సభ జరిగింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి ఏడు నెలలు పూర్తి అయ్యిందని అప్పటి నుంచి మా పట్ల ఇటు ప్రభుత్వంలో గానీ, అటు పార్టీలోగానీ కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్యేలుగా ఓడిన అభ్యర్థులకంటే ఎక్కువ ఓట్లు పొందా మన్నారు. మా లెటర్‌హెడ్‌ల సిఫారసులను పరిగణించడం లేదన్నారు. కానీ ఎమ్మెల్యేలుగా ఓడినవారికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పార్టీ విషయంలోనూ ఇదే విధానం కొనసాగుతోందన్నారు. మాకు తగిన గుర్తింపు ఇవ్వాలని మైసూరు నాయకుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓడినంత మాత్రాన నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. సభలో మృణాల్ హెబ్బాళ్కర్, సంయుక్త పాటిల్, స్టార్ చంద్రు, ముద్దహనుమేగౌడ, ప్రొఫెసర్ రాజీవ్ గౌడ, మన్సూర్ అలిఖాన్, జయప్రకాశ్‌హెగ్డే, రాజు అలగూరు పాల్గొన్నారు.

బాత్రూంలో సీక్రెట్ కెమెరా.. మహిళకు బ్లాక్‌మెయిల్

బెంగళూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గీజర్ అమర్చేందుకు వచ్చిన మెకానిక్ మురళి బాత్రూంలో రహస్య కెమెరా ఉంచి బ్లాక్‌మెయిల్ చేసిన సంఘటన నగరంలో వెలుగులోకి వచ్చింది. బన్నేరుఘట్ట రోడ్డు సీకే పాళ్యలోని ఓ ఇంట్లో కొన్ని నెలలక్రితం గీజర్ అమర్చేందుకు వచ్చి బాత్రూంలో రహస్య కెమెరాను అమర్చాడు. కుటుంబ సభ్యులు గుర్తించ లేకపోయారు. ఆ ఇంటి మహిళకు ఫోన్ చేసి నేను పిలిచినప్పుడు రావాలని లేదంటే వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు వైరల్ చేస్తానని బెదరించాడు. మీ పరువు తీస్తానని బెదరిస్తూ వచ్చాడు. సదరు మహిళ ఇటీవలి పరిణామాలను కుటుంబ సభ్యులకు తెలిపారు. గీజర్ రిపేరీ ఉందని పిలిపించి కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు అతడిని చితకబాదారు. శనివారం బన్నేరుఘట్ట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1618.83	1,588.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,028	5913
నీటి నిల్వ (టీఎంసీలు)	58.11	9.93

రెండు లారీల ఢీ
నలుగురి మృతి

● ముగ్గురికి గాయాలు

అడయార్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో ఆదివారం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయల లోడుతో కోయంబేడు మార్కెట్‌కు లారీ బయలుదేరింది. ఈ లారీ కృష్ణగిరి - చెన్నై జాతీయ రహదారిలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని... ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుల్ జ్యోతి (32), మణికంఠన్ (42), నారాయణన్ (45) ఘటనా స్థలంలో ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన బదామి (40)ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. ఖాదర్, విజయ్, రాజేష్ అనే వారు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై బర్గూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా, ఈ క్షతగాత్రుల్లో ఖాదర్, విజయ్ రాజేష్‌లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

బకాయిలు వసూలు చేయాలి
మున్సిపల్‌శాఖ మంత్రి రహీమ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రహీమ్ ఖాన్

బళ్లారి సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నగర పాలక సంస్థలు వివిధ రకాల పన్ను బకాయి సొమ్మును వసూలు చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి రహీంఖాన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని నూతన జిల్లా పాలనా భవనంలోని హాల్లో శనివారం సాయంత్రం నిర్వహించిన పట్టణ ప్రగతి సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వివిధ ఆస్తుల పన్నుల సొమ్ము, నీటి చార్జీలు,షాపుల చార్జీలు, ట్రేడ్ లైసెన్స్‌లను నిర్దిత లక్ష్యం మేరకు వసూలు చేయాలని తెలిపారు. ఎక్కువ బకాయిలు ఉంటే మున్సిపల్ కమిషనర్, చీఫ్ అకౌంటెంట్ స్వయంగా సందర్శించి వసూలు చేయాలన్నారు. జిల్లాలోని ఇతర స్థానిక సంస్థలతో పోల్చితే 2024-25 సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లలో కురేకుప్ప మున్సిపాలిటీ 13.26 శాతం మాత్రమే ప్రగతిని సాధించిందని అన్నారు. ఇంటి నిర్మాణాల్లో జరుగుతున్న పన్ను ఎగవేతదారులను గుర్తించి వసూలు చేయాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, పట్టణపంచాయతీల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. తాగునీటికి తుంగభద్ర జలాశయంపై ఆధారపడి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పేద ప్రజలకు తక్కువ ధరకు ఆహారం అందించడం ముఖ్యమంత్రి సిద్దరామయ్య కలల ప్రాజెక్టు ఇందిరా క్యాంటీన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తెలిపారు. అన్ని క్యాంటీన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, తాగునీటి సరఫరా, యూజీడీ సహా పలు ప్రాజెక్టుల స్థితిగతులపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఇంజనీర్ బసవరాజు, జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి రాఘవేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్‌స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా

కనగానపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం జంక్షన్ వద్ద ఆదివారం బొలేరోరా వాహనం, ఇసుక ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం చెల్లాచెదురయ్యాయి. సమాచారం అందుకున్న కనగానపల్లి పోలీసులు రోడ్డుపై పడి ఉన్న వాహనంతోపాటు బియ్యం ప్యాకెట్లు పక్కకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

● జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ● మున్సిపల్ శాఖ మంత్రి రహీంఖాన్ ● ఘనంగా గణతంత్ర వేడుకలు





గణతంత్ర వేడుకల్లో మంత్రి రహీం ఖాన్, కోర్టు వద్ద మాట్లాడుతున్న న్యాయాధికారి కేజీ శాంతి

బళ్లారి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ శాఖ మంత్రి రహీంఖాన్ పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకల్లో ఆయన జిల్లాలోని బిమ్స్ మైదానంలో పాల్గొని త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన ఏకైక దేశం భారత్ మాత్రమే అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగరాల సమగ్రాభివృద్ధికి సంబంధించి సీఎం సిద్దరామయ్య అమృత నగ్రోతన, మహాత్మాగాంధీ నగర్ వికాస్ యోజన, రైతులకు, పట్టణ పేద ప్రజలకు ఆకలి తీర్చేందుకు ఇందిరా క్యాంటీన్లు నడుపుతున్నామన్నారు. కల్యాణ కర్ణాటకకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయుల, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, డీజీపీ లోకేష్‌బాబు, ఎస్పీ శోభారాణి పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన నృత్యం, కళానైపుణ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు మంత్రి బహుమతులు అందించారు.

● గణతంత్ర దేశంగా భారత్‌ను మార్చేందుకు ఎందరో యోధులు కృషి చేశారని జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆమె జాతీయ జెండా ఎగురవేశారు. ప్రిన్సిపల్ ఫ్యామిలీ న్యాయాధికారి సిద్దలింగ ప్రభు, న్యాయాధికారి విద్యాధర శిరహట్టి, అదనపు న్యాయాధికారి రాఘవేంద్రగౌడ్, న్యాయాధికారి ఇబ్రహీం ముజఫర్, సివిల్ న్యాయాధికారి ముదుకప్ప పాల్గొన్నారు.

వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా





వేషధారణల్లో విద్యార్థుల నృత్యాలు



జాతీయ జెండాతో విద్యార్థుల నృత్యం

బళ్లారి సిటీ/బళ్లారి రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో గణతంత్ర వేడుకలను పలు విద్యాసంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యంకోసం పోరాడిన నాయకులను స్మరించుకున్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. పీడీహళ్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐలు నాగభూషణ, పరుశురామ్ నేతృత్వంలో మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు. మోకా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ కాళింగ నేతృత్వంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌టీఓ కార్యాలయం లో ఏఆర్‌టీఓ శ్రీనివాస్‌గిరి నేతృత్వంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీవోలు మహమ్మద్ రఫిక్, హేమంత్‌కుమార్, శరణయ్య, నిజాముద్దీన్ పాల్గొన్నారు. శ్రీమాతృ మహిళా మండలి అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంజీ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, ప్రశంస పత్రాలు అందించారు.







శ్రీనందా రెసిడెన్సీ పాఠశాల, సరళాదేవి కళాశాల, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గణతంత్ర వేడుకలు

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం

●ఎడెదొరె నాడు పేరుతో జిల్లా ఉత్సవాలకు నిర్ణయం ● మంత్రి డాక్టర్ శరణుప్రకాశ్ పాటిల్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ శరణుప్రకాశ్ పాటిల్

రాయచూరు జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు మరింత సౌకర్యం కల్పించే విధంగా త్వరలోనే కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణుప్రకాశ్ పాటిల్ తెలిపారు. కలబుర్గి-బీదర్ జిల్లాల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా వాటి మాదిరిగానే జిల్లాలోను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాళ్లకు రూ.450 బోనస్ అందజేస్తుందన్నారు. ఆదివారం నగరంలో 76వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటీల్ విలేకరులతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఎడెదొరె నాడు పేరుతో జిల్లా స్థాయి ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికారికి సూచించామని మంత్రి వెల్లడించారు. రాయచూరు నగరసభను మహానగర పాలికగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో అభివృద్ధి పనుల కోసం రూ.200 కోట్లు నిధులు విడుదల చేసిన ఇప్పటికే ముఖ్యమంత్రిని కోరినట్లు మంత్రి తెలిపారు. విమానయానం పనులు త్వరలోనే ప్రారంభిస్తామని పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పెట్టుబడిదారులతో చర్చిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాయచూరు జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న సానుకూలతలను పెట్టుబడిదారులకు వివరించి పరిశ్రమల ఏర్పాటు ద్వార జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఓపెక్ ఆస్పత్రిలో మరిన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు త్వరలోనే ప్రారంభిస్తామని ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించుకునే పండిత్ సిద్దరామ్ జంబలదిన్ని రంగ మందిరాన్ని మరింత ఆధునిక రీతిలో నిర్మించేందుకు వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన 3 ఎకరాల స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు 2వేల ఎకరాలు అవసరం కాగా ఆ మేరకు స్థలం లభ్యత లేనట్లు గుర్తించామన్నారు. కాగా జిల్లాలో ఎక్కడ ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరిగినా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.

హోసూరు జోన్

ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర వేడుకలు



బహుమతుల ప్రదానం చేస్తున్న అతిథులు

హోసూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): హోసూరులోని ఆర్‌వి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మునిరాజు జాతీయజెండాను ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హోసూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి తిమ్మరాయప్ప, యూనియన్ అధ్యక్షుడు గోపాలకృష్ణన్, రీజనల్ సెక్రటరీ రాము, రోటరీ మధు, ఈ పాఠశాల పూర్వ విద్యార్థి శరవణన్ ఉపాధ్యాయులు, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. విభాగ కార్యదర్శి రాము, రోటరీ మధు, పాఠశాల పూర్వ విద్యార్థి శరవణన్, పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌లు శ్రీధర్, యశస్విని మోహన్ మురుగన్, అక్రమ్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 మంది రక్తదానం

బళ్లారి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని హవ్వబావి వద్ద ఉండే విష్ణుప్రియ పాఠశాలలో విష్ణు ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మం ది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, కార్పొరేటర్ కల్పన, మాజీ మేయర్ రాజేశ్వరి, ట్రస్టు వ్యవస్థాపకుడు జులాది సాయి కృష్ణ పాల్గొన్నారు.

26 పంచాయతీల్లో గ్రామ సభలు



కార్పొరేషన్ కార్యాలయంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

హోసూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సందర్భంగా కృష్ణగిరి జిల్లా హోసూరు పంచాయతీలోని 26 పంచాయతీలలో ఆదివారం గ్రామ సభలు నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయపతాకాన్ని మేయర్ స త్య ఆవిష్కరించారు. ముఖ్యంగా ఒన్నలవాడీ పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని ఒన్నల్‌వాడీ గ్రామ పం చాయతీ ప్రత్యేక అధికారి స్థానిక అభివృద్ధి అధికారి కుమరేశన్‌కు ప్రజలు వినతిపత్రం అందించారు. సోమనాథపురం, నవది, ఓ-శారపల్లి, లక్ష్మి నరసింహనగర్ ప్రాంతాలు పంచాయతీలో ఉన్నట్లు తెలిపారు. పంచాయతీలోని కుగ్రామాలలో రైతులు, వ్యవసాయ కూలీ కార్మికులు అధికంగా ఉండి ఉపాధి హామీ పథకం ద్వారా జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీల్లో నీటి సరఫరా విభాగం ద్వారా మున్సిపల్ పరిపాలన ద్వారా హోసూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పంచాయతీల్లోని 50 శాతం గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడ్డారన్నా రు. పశువుల పెంపకం, ఖాళీ స్థలాలను ఉంచే రైతులు కూడా పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు.



శిబిరం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

కీళ్ల నొప్పులకు పరీక్షలు

హోసూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కీళ్లనొప్పుల పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ అనురాధ, బోన్ రీప్లేస్‌మెంట్ సర్జన్‌లు జ్యోతి ప్రజ్వలన చేశారు. కీళ్లనొప్పులు, కండరాలు నొప్పులు, ఎముకల సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేశారు. నాన్-ఫార్మాకోలాజికల్ మేనేజ్‌మెంట్ చికిత్స జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స ఉంటుందని డాక్టర్ రాజదురై తెలిపారు. నెలఖారు వరకు జరుగుతున్న పరీక్షా శిబిరం ఉంటుందన్నారు.

అన్ని జిల్లాల్లో సమాన అభివృద్ధి

విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్



హొస్పేట్ గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న జమీర్ అహ్మద్

హొస్పేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని విజయనగర జిల్లా హొస్పేట్ రాజ్‌కుమార్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి పోలీస్ గౌరవ వందం స్వీకరించారు. అనంతరం అక్కడ త్రివర్ణ పతాకం ఎగర వేసి మాట్లాడారు. రాజ్యాంగం వల్లే సమానత్వం సాధ్యమయిందన్నారు. పేదలు, మహిళలు, యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సిద్దరామయ్య నేతృత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎస్ దివాకర్, సీఈవో నోంగ్ జాయ్ అహ్మద్ అలీ, ఎస్పీ శ్రీహరిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యానిలయాలు, బ్యాంకులు పార్టీ కార్యాలయాలు, కేంద్ర కార్యాలయాలల్లో త్రివర్ణ పతాకం ఎగరవేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం

రాయచూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శరణుప్రకాశ్ పాటిల్



ప్రసంగిస్తున్న మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్

రాయచూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాయచూర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్ పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని మహాత్మాగాంధీ క్రీడీమైదానంలో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్, నేతాజీ ఆశయాల మేరకు పని చేయాలన్నారు. రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జాతి పునర్ నిర్మాణంలో అందరం మమేకం కావాలన్నారు. కల్యాణ-కర్ణాటక ప్రాంతంలోని నిరుద్యోగులకు మేలు జరిగేలా 371(జే) ఆర్టికల్‌కు సంబంధించి కొన్ని సవరణలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. గతంతో పోలిస్తే తమ ప్రభుత్వం బడ్జెట్ నిధులను పెంచిందని వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. సిద్దరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.

మహేష్‌రెడ్డి మృతిపై అనుమానాలు

అనంతపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామా నికి చెందిన మహేష్‌రెడ్డి మృతిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని, దీనిపై సమగ్ర ద ర్యా ప్తు జరపాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని సోమలదొడ్డి సమీపంలో రైలు పట్టాల వద్ద పడిఉన్న మహేష్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిటాల శ్రీరామ్ ఆస్పత్రికి వెళ్లి మహేష్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళుల ర్పిం చా రు. అక్కడే ఉన్న కుటుంబసభ్యుల ఓదార్చి, అండగా తాము న్నామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ... తోపుదుర్తి మహేష్‌రెడ్డి 2019 తరువాత తనను కలిశారని, అప్పటినుంచి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు మహేష్‌రెడ్డిని టార్గెట్ చేస్తూవస్తున్నారన్నారు. అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. అయినా మహేష్‌రెడ్డి ధైర్యంగా నిలబడ్డారన్నారు. కొంతకాలంగా మహేష్‌రెడ్డి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేఖరరెడ్డి(రాజారెడ్డి) బెదరింపులకు దిగుతు న్నార న్నారు. ఇందుకు పేస్‌బుక్‌లో ఉన్న పోస్టులే సాక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే మహేష్‌రెడ్డి రైలు పట్టాలపై శవమై కనిపించడం పట్ల చాలా అనుమా నాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ మృతి ని ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును తప్పుదారి పట్టించడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యా ప్తు జరపాలని శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మృతిపై ఎస్పీని కలుస్తామని, అ వసరమైతే రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.

'భారత రాజ్యాంగ పీఠిక' ఆవిష్కరణ



రాజ్యాంగ పీఠికను ఆవిష్కరిస్తున్న మంత్రి రహీమ్‌ఖాన్, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ పార్క్‌లో ఆదివారం పురపాలక శాఖ మంత్రి రహీమ్‌ఖాన్ ఆంగ్లం, కన్నడ భాషల్లో గార్నెట్ స్టోన్‌తో చెక్కిన భారత రాజ్యాంగ పీఠికను ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలకు ప్రముఖులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, మేయర్ ముల్లంగి నందీశ్‌కుమార్, బళ్లారి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ జేఎస్ అంజనేయులు, డిప్యూటీ మేయర్ సుకుమ్, జోనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీఎస్ లోకేశ్‌కుమార్, కలెక్టర్ మహమ్మద్ జుబేర్, ఎస్పీ శోభారాణి, జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప, అధికారులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం గర్భగుడిలో తవ్వకాలు





పరిశీలిస్తున్న పోలీసులు, గర్భగుడిలో తవ్వకం జరిగిన దృశ్యం

రాయచూరు జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు జిల్లాలోని దేవదుర్గ పట్టణం గోపాల స్వామి వార్డులో ఉన్న ఆలయ గర్భ గుడిలో తవ్వకాలు జరిపారు. శనివారం రాత్రి వేళ ఈ తవ్వకాలు సాగినట్లు స్థాయికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం గుడి సమీపంలోకి వెళ్లిన వార్డు ప్రజలు గర్భ గుడిలో తవ్వకం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి వచ్చి పరిసరాలను పరిశీలించిన పోలీసులు గర్భ గుడిలో లింగాన్ని తొలగించి దాదాపు మూడు అడుగుల మేరకు తవ్వకాలు జరిపి ఉండడాన్ని చూసి, గుప్త నిధుల కోసమే ఈ పని జరిగినట్లు గుర్తించారు. కాగా నిధుల కోసం వచ్చిన దుండగులు గర్భ గుడిని తవ్వకాలు చేసేందుకు ఉపయోగించిన వస్తువులను అక్కడే వదిలి వెళ్లిపోయారు. వాటిని స్వాధీనం చేసుకున్న దేవదుర్గ పోలీసులు వేలిముద్రల ఆధారంగా దుండగులను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.